సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం | 2 | మార్చి | 2025



21న 'భారత్ గౌరవ్' యాత్ర
దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు దక్షిణ మధ్య రైల్వే ఈ నెల 21న భారత్ గౌరవ్ పేరుతో రైలు యాత్రను ప్రారంభించనుంది.
- 8లో▸



ఎన్పీడీసీఎల్‌కు లీడర్ షిప్ అవార్డు
తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ మండలి పీఎస్‌యూ లీడర్ షిప్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ ఆపరేషనల్ ఎక్సలెన్స్ అవార్డు అందుకుంది.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$36^0/21^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ, ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలిగా ఉంటుంది.




డిజిటల్ క్రాప్ సర్వే

పకడ్బందీగా పంటల లెక్క..

- క్షేత్రస్థాయిలో వివరాలు నమోదుచేస్తున్న ఏఈఓలు
- పంటకాలం వరకు గడువు
- నివేదిక ఆధారంగా పంట దిగుబడి కొనుగోళ్లు

కాటారం: డిజిటల్ క్రాప్ సర్వేతో పంటల లెక్క ఇక పక్కాగా ఉండనుంది. ప్రతి వ్యవసాయ క్లస్టర్ పరిధిలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోంది. ఏఈఓలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియ పూర్తయితే ఆయా పంటల సాగు వివరాలు పక్కాగా తేలనున్నాయి. వీటి ఆధారంగా రైతుల పంట దిగుబడులను ప్రభుత్వం కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. పంటకాలం పూర్తయ్యే వరకు సర్వే ముగించాల్సి ఉంటుంది.



సర్వే ఇలా..

సర్వే నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ యాప్‌ను రూపొందించింది. ఏఈఓలు పంటల సాగు విస్తీర్ణం, పంట రకం అంశాలను అందులో నమోదు చేస్తున్నారు. సర్వే నంబర్ ఎంట్రీ చేయగానే ఆ పరిధిలో ఉన్న రైతుల వివరాలు కనిపిస్తాయి. కావాల్సిన రైతు పేరు ఎంచుకోగానే వారి పేరిట ఉన్న భూమి వివరాలు దర్శనమిస్తాయి. అందులో రైతు ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నాడో నమోదు చేయాలి. సాగు ఫొటోను అప్‌లోడ్ చేయాలి. ఒక వేళ సాగులో లేని భూమి ఉంటే వాటిని నాన్‌క్రాప్ కింద నమోదు చేయాల్సి ఉంటుంది.



ప్రతి సర్వే నంబర్‌కు వెళ్లాల్సిందే..

వ్యవసాయ శాఖ సమకూర్చిన ట్యాబ్స్‌తో ఏఈఓలు సర్వే చేస్తున్నారు. తమ వద్ద ఉన్న ట్యాబ్‌లలో యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్నారు. ఈ యాప్‌లోనే క్లస్టర్ పరిధిలోని ఏయే సర్వే నంబర్లలో సర్వే చేయాలనే వివరాలు ఉన్నాయి. ప్రతీ సర్వే నంబర్‌తో పాటు సబ్ సర్వే నంబర్ వద్దకు ఏఈఓలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతీ సర్వే నంబర్‌లో 25 మీటర్లకు మించి దూరం ఉంటే వివరాలు చూపించడం లేదు. దీంతో ఏ ఒక్క సర్వే నంబర్ సమాచారం లేకున్నా అప్‌లోడ్ కాదు. ప్రతీ సర్వే నంబర్ వద్దకు ఏఈఓలు వెళ్తున్నారు.

పంటల నమోదు ఆధారంగా కొనుగోళ్లు..

సర్వేతో రైతులు సాగుచేసే పంటల వివరాలు పక్కాగా తేలనున్నాయి. తదనుగుణంగా వచ్చే దిగుబడిని రైతులు మార్కెట్‌లో ప్రభుత్వరంగ సంస్థకు మద్దతు ధరతో విక్రయించేందుకు అవకాశం ఉంటుంది. డిజిటల్ క్రాప్ సర్వే రైతులకు ఎంతో మేలు చేకూర్చనుంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బీమా పొందడానికి, పంట నష్టం అంచనా వేయడానికి దోహదపడుతుంది. రైతులు తాము పండించిన పంటలను మార్కెట్‌కు తీసుకువెళ్లి మద్దతు ధర పొందడానికి ఉపయోగపడుతుంది. వానాకాలంలో డిజిటల్ క్రాప్ సర్వే చేయించుకోకపోవడంతో పత్తి అమ్ముకోవడానికి రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

పలుచోట్ల ఇబ్బందులు..

సర్వేలో భాగంగా ఏఈఓలు పలు సమస్యలు ఎదురవుతున్నాయి. ఓ పక్క పెరుగుతున్నా ఎండలు ముప్పుతిప్పలు పెడుతుంటే కొన్ని చోట్ల ఇంటర్‌నెట్ సౌకర్యం అందుబాటులో లేకపోవడం, యాప్ ఓపెన్ కాకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పలు చోట్ల సర్వర్ నెమ్మదించడం, మరికొన్ని చోట్ల రైతుల చేలల్లో లొకేషన్ తప్పుగా చూపించడం, సర్వేనంబర్లు కనిపించకపోవడం లాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు ఏఈఓలు చెబుతున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఏఈఓలు క్రాప్ సర్వేను నిర్వహిస్తున్నారు.

రైతులు సహకరించాలి

జిల్లావ్యాప్తంగా డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఏఈఓలు రైతుల చేలు, పంట పొలాల వద్దకు వెళ్లి సాగు వివరాలు అక్కడే నమోదు చేస్తున్నారు. క్రాప్ సర్వే రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. రైతులు తాము పండించిన పంటలను అమ్ముకోవడానికి, పంటల బీమా, పరిహారం పొందడానికి సహాయపడుతుంది. రైతులు సర్వేకు వచ్చే ఏఈఓలకు సహకరించాలి.

- విజయభాస్కర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

18 రోజులుగా ఇక్కడే తిష్ట

- కాటారం, మహదేవపూర్ అటవీ ప్రాంతాల్లో పులి సంచారం
- దారి దొరకకనా..ఆవాసం కోసమా..

కాటారం: పులి నివసించడానికి అనువైన ప్రదేశం కాదు..దట్టమైన అటవీ ప్రాంతం అసలే కాదు.. కానీ ఎక్కడి నుంచో వచ్చిన పెద్దపులి ఇక్కడే 18 రోజులుగా తిష్టవేసింది. ఎటు వెళ్లాలో దారి దొరకకనో లేక స్థిర ఆవాసం కోసం ప్రయత్నిస్తుందో ఏమో కానీ పులి కాటారం, మహదేవపూర్ అడవి ప్రాంతంలో అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు సంచరిస్తుంది. రెండు రోజులకు ఒక చోట ఆనవాళ్లు వదులుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుంది. ఫిబ్రవరి 10న మహదేవపూర్ రేంజ్ పరిధిలోని కాటారం మండలం నస్తూర్‌పల్లి అటవీ ప్రాంతంలో ఓ రైతుకు పులి కనిపించడంతో పులి సంచారం ప్రచారంలోకి వచ్చింది. రంగంలోకి దిగిన అటవీ శాఖ అధికారులు పులి పాదముద్రలు (పగ్ మార్క్స్) గుర్తించి సంచారంపై ఆరా తీశారు. మరుసటి రోజు కాటారం రేంజ్ పరిధిలోని వీరాపూర్ అటవీ ప్రాంతంలో పులి తిరిగినట్లు అధికారులకు ఆనవాళ్లు లభించాయి. అనంతరం మహదేవపూర్ మండలం కుదురుపల్లి, పల్గుల, బీరాసాగర్, గుండ్రాత్‌పల్లి అటవీ ప్రాంతంలో పులి కనిపించినట్లు పలువురు తెలపడంతో అధికారులు పాదముద్రలు గుర్తించి ట్రాకింగ్ కెమెరాలు ఏర్పాటుచేసి పులి కదలికలపై నిఘా పెట్టారు. కానీ ఎక్కడ కూడా పులి కెమెరాలకు చిక్కిన దాఖలాలు లేవు. మధ్యలో రెండు, మూడు రోజులు జాడా లేకుండా పోయిన పులి రెండు రోజుల క్రితం మహదేవపూర్ మండలం ఏన్కపల్లిలో దర్శనమిచ్చింది. అక్కడి నుంచి ప్రతాపగిరి అడవుల్లోకి పులి చేరినట్లు శుక్రవారం అటవీశాఖ అధికారులు గుర్తించారు. అటవీశాఖ అధికారులు శనివారం ప్రతాపగిరి అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా ఓ వాగు వద్ద నీరు తాగినట్లు పాదముద్రల ఆనవాళ్లు సేకరించారు. నస్తూర్‌పల్లి అడవి వైపుగా వచ్చినట్లు కొంత దూరం పాదముద్రలు ఉన్నాయని కానీ ఎటు వెళ్లిందనేది మాత్రం స్పష్టత లేదని అటవీశాఖ అధికారులు చెప్పుకొస్తున్నారు.



ప్రతాపగిరి అటవీ ప్రాంతంలో అధికారులు గుర్తించిన పులి పాదముద్రలు

ఇక్కడిక్కడే..

గతంలో రెండు మార్లు పులి కాటారం, మహదేవపూర్ అటవీ ప్రాంతంలో సంచరించినప్పటికీ ఎప్పుడు కూడా మూడు నాలుగు రోజుల కంటే ఎక్కువగా ఉన్న దాఖలాలు లేవు. కానీ 18 రోజులుగా పులి ఇక్కడిక్కడే తచ్చాడుతుండటంతో దారి దొరకక ఎటు వెళ్లలేక ఉండిపోతుందో లేక ఈ అటవీ ప్రాంతంలో శాశ్వత ఆవాసం ఏర్పాటు చేసుకోవడానికి అనువైన స్థలం కోసం చూస్తుందో అంతుచిక్కకుండా పోయింది. ఒకటి రెండుమార్లు పులి అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గోదావరి నదిని దాటి చెన్నూరు అటవీ ప్రాంతంలోకి వెళ్లడానికి ప్రయత్నించినట్లు కొన్ని రోజుల క్రితం అటవీశాఖ అధికారులకు ఆధారాలు లభించాయి. కాటారం మండలం గుండ్రాత్‌పల్లి సమీపంలోని గోదావరి నది దాటడానికి వచ్చిన పులి కుక్కలు వెంటపడటంతో తిరిగి మహదేవపూర్ అడవిలోకి వెళ్లినట్లు ప్రచారం జరిగింది. అటు నుంచి మళ్లీన పులి కాటారం, మహదేవపూర్ మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో కలియ తిరుగుతుంది. పులి ఎప్పుడు ఎక్కడ ఉంటుందో ఏ వైపుగా వస్తుందో తెలియక అటవీ ప్రాంతానికి సమీపంలోని గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పులికి సంబంధించిన కదలికలను పూర్తి స్థాయిలో కనుక్కోవడం అటవీశాఖ అధికారులకు క్లిష్టతరంగా మారింది.

85శాతం బొగ్గు ఉత్పత్తి

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని కాకతీయ గనుల్లో ఫిబ్రవరి మాసంలో 85శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏరియాకు గడిచిన మాసంలో 4.55లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా 3.90లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 85శాతంలో నిలిచినట్లు తెలిపారు. వెలికితీసి బొగ్గులో 3.27లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసినట్లు చెప్పారు. మార్చి మాసానికి 6.39లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. గైర్హాజరు శాతాన్ని తగ్గించి ఉత్పత్తి పెంచే విధంగా కార్మికులు కృషి చేయాలని సూచించారు. ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంజూర్‌నగర్‌లోని ఇల్లంద క్లబ్‌హౌజ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

టీజీఎండీసీ పీఓ బదిలీ

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల టీజీఎండీసీ పీఓ(ప్రాజెక్టు అధికారి) కె.రంగారెడ్డి హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ములుగు జిల్లా పీఓ శ్రీకాంత్ బదిలీపై వచ్చారు. రంగారెడ్డి 13 రోజుల క్రితమే జిల్లాకు వచ్చి బదిలీపై వెళుతుండడం గమనార్హం.

మోటార్లు బిగిస్తే చర్యలు



భూపాలపల్లి అర్బన్: మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ పంపులకు మోటార్లు బిగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆదేశించారు. పట్టణంలోని సుభాష్‌కాలనీలో శనివారం పర్యటించి కాలనీ వాసులతో మాట్లాడారు. వేసవి కాలం నేపథ్యంలో కాలనీ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూస్తున్నట్లు తెలిపారు. కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటిని వృథా చేయకుండా ట్యాప్ ఆఫ్ చేసుకోవాలని సూచించారు. నీటి కుళాయికి మోటార్లు బిగించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకొని మోటార్లను జప్తు చేసుకుంటామని సూచించారు.

హత్య కేసులో మరొకరి అరెస్ట్

భూపాలపల్లి అర్బన్: ఫిబ్రవరి 19న జిల్లా కేంద్రంలో జరిగిన రాజలింగమూర్తి హత్య కేసులో మరొకరిని అరెస్ట్ చేసినట్లు సీఐ నరేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజలింగమూర్తి హత్య కేసులో పరారీలో ఉన్న ఏ-9 నిందితుడు పుల్ల నరేష్‌ను శనివారం పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మిగిలిన నిందితులను అతి త్వరలో పట్టుకొని రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

ఎట్టకేలకు తెరుచుకున్న గేట్లు



ఏటూరునాగారం : ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌కు భద్రతపరంగా 25 ఏళ్ల క్రితం జాతీయ రహదారిపై వేసిన గేట్లను శనివారం తొలగించారు. 2001లో అప్పటి పీపుల్స్ వార్ నాయకులు మందుగుండు సామగ్రితో ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌ను పేల్చి వేసే ప్రయత్నం చేశారు. ఆ ఘటనలో ఐదుగురు పోలీసులు మృతి చెందారు. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉన్నత స్థాయి అధికారులు పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న జాతీయ రహదారిపై రెండువైపులా గేట్లు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేశారు. దీంతో ఐటీడీఏ పీఓ గెస్ట్ హౌస్ మీదుగా భారీ వాహనాలు వెళ్తూ ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారాయి. వాహనాలు వెళ్లడానికి మళ్లించిన రహదారి గుంతల మయమై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఘటనపై సాక్షిలో పలుమార్లు ప్రయాణికుల అవస్థలు పడుతున్న తీరును ప్రచురించబడ్డాయి. ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర వాహనాలను ప్రధాన రోడ్డు వెంట వెళ్లడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి సీతక్క ఆదేశంతో తొలగిన గేట్లు

ప్రయాణికులు పడుతున్న అవస్థలను గమనించిన మంత్రి సీతక్క సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి పోలీసుల నుంచి ఆదేశాలు రావడంతో ఎట్టకేలకు మూసి వేసిన గేట్లను తొలగించారు.

ట్రెజరీలో పైసా వసూల్..?

- ప్రైవేట్ వ్యక్తి ఫోన్‌కు డిజిటల్ చెల్లింపు



కాళేశ్వరం: భూపాలపల్లి, కాటారం సబ్‌డివిజన్‌లో ప్రభుత్వ ఉద్యోగులు డీడీఓల ద్వారా ప్రతి నెల ట్రెజరీకి వేతన బిల్లులు సమర్పిస్తున్నారు. ప్రతి ఏటా ఫిబ్రవరిలో ఐటీ రిటర్న్‌లు, పన్ను మినహాయింపు బిల్లులు వేతన బిల్లులతో జత చేయాల్సి ఉంది. దీంతో కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు సైతం అక్రమమార్గంలో బిల్లులు చెల్లించడంతో వాటిని అదునుగా తీసుకున్న ట్రెజరీశాఖ ఉద్యోగులు పైసా వసూల్‌కు తెరలేపారని సమాచారం. కాటారం, భూపాలపల్లిలో ట్రెజరీ ఉద్యోగులు అందినకాడికి తప్పులు ఎత్తిచూపి డబ్బులు లాగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో మొత్తం 28 ప్రభుత్వ పాఠశాలల్లోని స్కూల్‌కాంప్లెక్సులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు నాలుగువేల మంది వరకు ఉన్నారు. ఇందులో ప్రతీ స్కూల్ కాంప్లెక్సుకు రూ.20వేల నుంచి 30వేల వరకు ఐటీ రిటర్న్‌లు, పన్ను మినహాయింపుల కోసం డబ్బులు చేతులు మారాయని తెలిసింది. వీరిపైన ఉన్నతాధికారులు దృష్టిసారించకపోవడంతో భూపాలపల్లి, కాటారం డివిజన్‌లలో పైసావసూల్ అంతా నగదు రూపంలో కాకుండా డిజిటల్ చెల్లింపుల ద్వారా యథేచ్ఛగా సాగినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగుల తప్పులు కూడా ఉండడంతో ట్రెజరీ ఉద్యోగులపై ఫిర్యాదు చేయడానికి జంకుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంతో ట్రెజరీ శాఖ ఉద్యోగులు పదిరోజుల్లో రూ.లక్షల్లో అక్రమమార్గంలో సంపాదించారని కోడై కూస్తుంది. డిజిటల్ చెల్లింపులకు ఓ ప్రైవేట్ వ్యక్తిని కూడా ఏర్పాటు చేసుకొని వారి ఫోన్‌కు డబ్బులు పంపితేనే ఫైల్ కదులుతుందని ఓ ప్రభుత్వ ఉద్యోగి వాపోయారు. వీరిపై అధికారులు అంతర్గత విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు బాధిత ఉద్యోగులు కోరుతున్నారు.

ఇబ్బందులు లేకుండా 'రంజాన్' ఏర్పాట్లు

- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: రంజాన్ మాసంలో ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. నేటి (ఆదివారం) నుంచి ప్రారంభమైన రంజాన్ మాసం ఏర్పాట్లుపై శనివారం ఐడీఓసీ కార్యాలయంలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని మసీదుల వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ప్రత్యేక ప్రార్థనా సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. భూపాలపల్లి, కాటారం, మహదేవపూర్ మండలాల్లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ప్రార్థనా మందిరాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఉండాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో సంతోషంగా రంజాన్ పండుగను ప్రజలందరూ జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శైలజ, డీఎస్పీ సంపత్‌రావు, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్చూర్‌నాయక్, డీపీఓ నారాయణరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.



రంజాన్ మాసంలో తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

యూడీఐడీపై అవగాహన కల్పించాలి..

దివ్యాంగులకు యూడీఐడీ కార్డుల జారీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంపై అవగాహన కల్పించాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ సూచించారు. శనివారం యూడీఐడీ, సోలార్ విద్యుత్ ఏర్పాటుకు మహిళా సంఘాలు డీపీఆర్ అందజేసే అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌శర్మ జిల్లా అధికారులతో మాట్లాడారు. లబ్ధిదారులు యూడీఐడీ పోర్టల్ ద్వారా స్లాట్‌బుక్ చేసుకునేందుకు మీసేవా కేంద్రాల నిర్వాహకులు, డీఆర్‌డీఏ, సంక్షేమ శాఖల సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ హాస్పిటల్ క్యాంప్‌లో దివ్యాంగులకు సర్టిఫికెట్ జారీ చేయుటకు కావాల్సిన సామగ్రి, టెక్నీషియన్స్, వైద్యుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, డీఆర్‌డీఓ నరేష్ పాల్గొన్నారు.

రామప్పను దర్శించిన కేరళీయులు

వెంకటాపురం(ఎం) : మండలంలోని రామప్ప ఆలయాన్ని కేరళకు చెందిన 27 మంది శనివారం సందర్శించారు. అంతర్రాష్ట్ర యువజన సమ్మేళన కార్యక్రమంలో భాగంగా కేరళకు చెందిన యువకులు రామప్ప ఆలయాన్ని సందర్శించి రామలింగేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను టూరిజం గైడ్ విజయ్‌కుమార్ వివరించారు. గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సును సందర్శించి వేలాడే వంతెన, ప్రకృతి అందాలను తిలకించినట్లు నెహ్రూ యువకేంద్రం సూపరింటెండెంట్ బానోత్ దేవీలాల్ తెలిపారు. కార్యక్రమంలో భాను, సురేశ్, భిక్షపతి పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన విదేశీయుడు..

రామప్ప దేవాలయాన్ని అమెరికాకు చెందిన మార్క్ మెక్ లహ్ సందర్శించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకోగా పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతను గైడ్ విజయ్‌కుమార్ వివరించగా రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్ అంటూ కొనియాడారు. నందీశ్వరుడి అందాలను సెల్‌ఫోన్‌లో బంధించుకున్నారు. రామప్పను సందర్శించిన పర్యాటకులు అమెరికన్‌తో ఫొటోలు దిగుతూ ఆనందం వ్యక్తం చేశారు.



రామప్పలో కేరళ బృందం



నందీశ్వరుడి అందాలను సెల్‌ఫోన్‌లో బంధించుకుంటున్న అమెరికన్

ప్రజల వద్దకే తపాలా సేవలు



ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ డబ్బులు అందజేస్తున్న ఏఎస్పీ అనంత్‌రామ్ నాయక్

రేగొండ: ప్రజల వద్దకు పోస్టాఫీస్ సేవల కార్యక్రమంలో భాగంగా పరకాల ఏఎస్పీ అనంత్‌రామ్ నాయక్ శనివారం కొత్తపల్లిగోరి మండలంలోని రాజక్కపల్లి, చిన్నకోడేపాక, చెన్నాపూర్ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆసరా పెన్షన్, ఉపాధిహామీ నగదును లబ్ధిదారులకు అందజేశారు. నిస్సహాయక పెన్షన్‌దారులు కొండెటి సూరమ్మ ఇంటికి వెళ్లి పెన్షన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోస్టాఫీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రూ.755లకు రూ.15 లక్షల ప్రమాదబీమా సౌకర్యాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని అన్నారు. తపాలాశాఖ మినీ ఏటీఎం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట తపాలా సిబ్బంది సంతోష్, కృష్ణ ఉన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

భూపాలపల్లి అర్బన్: ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాల నివారణపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని కోర్టులో శనివారం న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి బ్యాంక్ అధికారులు జిల్లా కోర్టు ఆవరణలో అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ నారాయణబాబు ప్రారంభించారు. బ్యాంక్ అధికారులు, రిసోర్స్ పర్సన్స్ సాయిచరణ్,, రాకేష్, అనిల్, శ్రీకాంత్ ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలపై వివరించారు. నేటి డిజిటల్ యుగంలో ఆన్‌లైన్‌లో కేసులను ఎలా ఫైల్ చేయాలి, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాల పట్ల తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. డిజిటల్ లిటరసీ అనేది చాలా ముఖ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ జడ్జిలు జయరాంరెడ్డి, రామచంద్రరావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.



కలర్‌ఫుల్.. ఫెస్ట్

-8లో

నిట్ వరంగల్ వసంతోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న స్ప్రింగ్‌స్ప్రీ-25 వేడుకలు రెండోరోజు శనివారం కలర్‌ఫుల్‌గా సాగాయి. దేశవ్యాప్త వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు తమ సంస్కృతీ సంప్రదాయాల ప్రదర్శనలతో పోటీ పడ్డారు. గీతామాధురి, మ్యాడ్-2 రాకతో ప్రోషో అదిరిపోయింది. కొరియో నైట్‌లో విద్యార్థులు స్టెప్పులతో సందడి చేశారు. ఈ వేడుకలు నేడు ముగియనున్నాయి.

- కాజీపేట అర్బన్

హేమాచలక్షేత్రంలో భక్తుల సందడి

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయంలో సందడి వాతావరణం నెలకొంది. ఉదయాన్నే భక్తులు వివిధ ప్రాంతాల నుంచి కార్లు, ఆటోలలో హేమాచల క్షేత్రానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంతంలోని చింతామని జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిలతైలాభిషేకం పూజలో పాల్గొని స్వామివారి నిజరూప దర్శనం చేసుకున్నారు. సంతాన ప్రాప్తికి వచ్చిన దంపతులకు ఆలయ పూజారులు నాభిచందన ప్రసాదం అందజేశారు.



సీపీఆర్‌తో కండక్టర్ ప్రాణాలు కాపాడిన ఆర్టీసీ డ్రైవర్

చిల్పూరు: నైట్‌హాల్ట్ బస్సులో అర్ధరాత్రి కండక్టర్ ఒక్కసారిగా కుప్పకూలిపోగా పక్కనే ఉన్న డ్రైవర్ సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. ఆర్టీసీ జనగామ డిపో మేనేజర్ స్వాతి, డ్రైవర్ ప్రసాద్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. తరిగొప్పుల బస్సుకు చిల్పూరు మండలం కొండాపూర్‌లో నైట్‌హాల్ట్ ఉంది. రోజు మాదిరిగానే శుకవారం రాత్రి బస్సులో కండక్టర్ యాదయ్య, డ్రైవర్ బీఆర్.ప్రసాద్ కొండాపూర్ చేరుకున్నారు. రాత్రి భోజనం ముగించుకుని నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి కండక్టర్ యాదయ్య ఒక్కసారిగా అరుస్తూ వాంతులు చేసుకుంటూనే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో డ్రైవర్ ప్రసాద్ వెంటనే 108 అంబులెన్స్ సిబ్బందికి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇస్తూనే సీపీఆర్ చేయడంతో కండక్టర్ స్పృహలోకి వచ్చాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కండక్టర్ ఆరోగ్యం నిలకడగా ఉందని, సీపీపీ చేయడం వల్లే ప్రాణాపాయం తప్పిందని డాక్టర్లు అన్నారు. డ్రైవర్ ప్రసాద్‌ను డిపో మేనేజర్ స్వాతి అభినందించారు.

ఆశపడి.. మోసపోయాడు

- రూ.9.51 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

కమలాపూర్ : టెలిగ్రామ్ యాప్‌లో వచ్చిన టాస్కులు ఆడితే జమ చేసిన మొత్తానికి రెట్టింపు నగదు వస్తుందని ఆశపెట్టారు.. ఓ యువకుడు నమ్మి రూ.9.51 లక్షలు పోగొట్టుకొని మోసపోయాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన వట్టేముల మనోజ్ గత నెల 6న టెలిగ్రామ్ యాప్ ద్వారా భావి జోషి అనే అడ్రస్ నుంచి ఇందులో డబ్బులు జమ చేసి తాము చెప్పిన టాస్కులు ఆడితే జమ చేసిన డబ్బులకు రెట్టింపు నగదు వస్తాయని మెసేజ్ వచ్చింది. దీనిని నమ్మిన మనోజ్ విడతల వారీగా మొత్తం రూ.9.51 లక్షలు డిపాజిట్ చేసి వారు నిర్దేశించిన టాస్కులు ఆడాడు. ఎంతకూ తనకు రావాల్సిన రెట్టింపు నగదు రాకపోవడంతో మోసపోయానని గ్రహించాడు. వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. శనివారం కమలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు.

సైబర్ నేరం.. కేసు నమోదు

డోర్నకల్: తన ఖాతా నుంచి బలవంతంగా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయించిన ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. డోర్నకల్ సీఐ బి.రాజేశ్ కథనం ప్రకారం.. స్థానిక శాంతినగర్‌కు చెందిన వెంకటసాయి క్రెడిట్ కార్డు ద్వారా రూ.23 వేలు వాడుకున్నాడు. ఈ క్రమంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి క్రెడిట్ కార్డు అప్పు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐదు దఫాలుగా రూ.40 వేలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. అనంతరం ఇంకా డబ్బు చెల్లించాలని, లేనిపక్షంలో న్యూడ్ ఫొటోలు బంధువులకు పంపుతామని ఒత్తిడి తీసుకొచ్చాడు. దీంతో బాధితుడు వెంకటసాయి 1930 నంబర్ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పోలీసుల ట్రాన్స్‌ఫరైన డబ్బులో రూ.15,391 హోల్డ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజేశ్ తెలిపారు.

హ్యాండ్ ప్రింట్.. ఇదే నా బ్రాండ్



నిట్ వరంగల్ వాల్యూ ఎడ్యుకేషన్ అండ్ ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు హ్యాండ్ ప్రింటింగ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇదే నా బ్రాండ్ అంటూ పుష్పా సినిమా డైలాగ్‌తో అర చేతిని వివిధ రకాల రంగుల్లో ముంచి ముద్ర వేశారు. విద్యార్థులు పరస్పరం తమ హ్యాండ్ ప్రింట్‌ను 'టి' షర్ట్‌పై ఏర్పాటు చేసుకుని జ్ఞాపకంగా అందజేసుకున్నారు.

మట్టి పట్టు.. కుండ చేత పట్టు



స్ప్రింగ్ స్ప్రీ–25 వేడుకల్లో భాగంగా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో భాగంగా ధర్మసాగర్ మండలం ఉనికిచర్లకు చెందిన సారయ్య సారథ్యంలో విద్యార్థులు పాట్ మేకింగ్‌ను ఉత్సాహంగా చేపట్టారు. కుమ్మరులు తమ కులవృత్తిని నేటి తరానికి అందజేసేందుకు మట్టిని పట్టు.. కుండలను తయారు చేసి చేత పట్టు అంటూ ఉత్సాహంగా కుండలు తయారు చేశారు.

నువ్వా? నేనా.. స్నేక్స్ అండ్ ల్యాడర్స్



నిట్ యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో స్ప్రింగ్‌స్ప్రీ–25లో భాగంగా చిన్నప్పుడు ఆడుకునే స్నేక్స్ అండ్ ల్యాడర్స్‌ను ఏర్పాటు చేశారు. కైలాసంలో నువ్వా? నేనా పాముకు నువ్వు బలి.. నిచ్చెనతో నేను గెలిచి అంటూ విద్యార్థులు పిల్లల స్నేక్స్ అండ్ ల్యాడర్స్ ఆటలో పాల్గొన్నారు.

కలర్‌ఫుల్.. ఫెస్ట్



అద్వితీయంగా 'నిట్' వసంతోత్సవం

- ఉత్సాహంగా పోటీ పడిన విద్యార్థులు
- గీతామాధురి, మ్యాడ్–2 సినిమా టీమ్ రాకతో ఫ్రోషో అదుర్స్
- కొరియో నైట్‌లో స్టెప్పులేసిన విద్యార్థులు
- నేటితో ముగియనున్న స్ప్రింగ్ స్ప్రీ–25 వేడుకలు

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లో మూడు రోజుల వసంతోత్సవ వేడుకలు స్ప్రింగ్‌స్ప్రీ–25 రెండో రోజు శనివారం కలర్‌ఫుల్‌గా సాగాయి. దేశవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి హాజరైన పదివేల మంది విద్యార్థులు తమ ప్రాంత సంస్కృతీసంప్రదాయాలను పరస్పరం పంచుకుంటూ ఆకట్టుకున్నారు. రెండో రోజు కలర్ పెయింటింగ్స్, ఆర్ట్స్, హ్యాండ్ ప్రింటింగ్, పాట్ మేకింగ్, స్నేక్స్ అండ్ ల్యాడర్స్, మేజ్ రన్, స్ట్రీట్ ఫొటోగ్రఫీ, పోలరాయిడ్ ఫొటోగ్రఫీ, ఆర్ట్ థెరపీ, తానాబానా, ట్రెజర్ హంట్, తదితర విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పోటీపడ్డారు.

నేటితో ముగియనున్న స్ప్రింగ్ స్ప్రీ–25..

నిట్‌లో విద్యార్థులే నిర్వాహకులుగా నిర్వహిస్తున్న మూడు రోజుల స్ప్రింగ్‌స్ప్రీ–25వేడుకలు ఆదివారం మూడో రోజుతో ముగియనున్నాయి. చివరి రోజు అల్యూర్‌లో భాగంగా ఫ్యాషన్ షో, డీజే నైట్, నుక్కడ్ నాటక్, బైక్ స్టంట్స్‌తో బైబై నిట్ అంటూ విద్యార్థులు స్ప్రింగ్ స్ప్రీ–25కు వీడ్కోలు పలుకుతారు.



పాడుతున్న సింగర్ గీతామాధురి

ఉర్రుతలూగించిన గీతామాధురి

నిట్ వరంగల్‌లో నిర్వహిస్తున్న మూడు రోజుల వసంతోత్సవ వేడుకలు స్ప్రింగ్‌స్ప్రీ–25లో భాగంగా సింగర్ గీతామాధురి తన పాటలతో ఉర్రుతలూగించారు. మ్యాడ్–2 సినిమా టీమ్ రాకతో విద్యార్థులు కేకలు వేస్తూ ఉత్సాహంగా డ్యాన్స్‌లు వేశారు.

కళ్లకు గంతలు.. అయినా చేరుతా గమ్యం



కళ్లకు గంతలు కట్టినా మీరు చూపే మార్గంతో గమ్యాన్ని చేరుతానంటూ వసంతోత్సవ వేడుకల్లో ఏర్పాటు చేసిన మేజ్ రన్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. నిట్ యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేజ్ రన్ పోటీల్లో విద్యార్థులు పాల్గొని తమ మిత్రుడికి తామే కళ్లకు గంతలు కట్టి మార్గ నిర్దేశం చేసి గమ్యాన్ని చేర్పించి 'వీ ఆర్ ఫ్రెండ్స్' అంటూ ఎంజాయ్ చేశారు. నేను నా ఫ్రెండ్‌ను గుడ్డిగా నమ్ముతానని ఆనందం వ్యక్తం చేశారు.

నే శారీ కడితే...



సంస్కృతీ,సంప్రదాయాలను పరస్పరం విద్యార్థులు పంచుకునే వేదికగా నిలుస్తున్న స్ప్రింగ్‌స్ప్రీ–25 వేడుకల్లో ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ ఆదర్శంగా భారతీయ ఆహార పద్ధతులు, వస్త్రధారణపై నేటి తరానికి అవగాహన కల్పించేందుకు విద్యార్థులు శారీ కట్టుకుని విద్యార్థినులకు దీటుగా ముస్తాబయ్యారు. నేను శారీ కడితే ఎలా ఉంది అంటు వయ్యారంగా వాకింగ్ చేస్తూ అలరించారు.

యుద్ధానికి నువ్వు రెడీనా? ట్రెజర్ హంట్



అచ్చం యుద్ధంలో పాల్గొనే మిలిటరీని తలపిస్తూ విద్యార్థులు యుద్ధానికి నువ్వు రెడీనా? నేను రెడీ అంటూ శత్రువులపై తలపడేందుకు పోటీ పడ్డారు. నిట్ లిటరరీ అండ్ డిబేట్‌క్లబ్ సారథ్యంలో ఏర్పాటు చేసిన ట్రెజర్ హంట్‌లో విద్యార్థులు సైనికుల మాదిరి వస్త్రధారణతో ఆకట్టుకున్నారు.

21న 'భారత్ గౌరవ్' యాత్ర

- జనగామ, కాజీపేట, వరంగల్ మీదుగా స్పెషల్ టూరిస్ట్ రైలు



మాట్లాడుతున్న కిశోర్ సత్య

కాజీపేట రూరల్/జనగామ: దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు దక్షిణ మధ్య రైల్వే ఈనెల 21న సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు 'భారత్ గౌరవ్' స్పెషల్ టూ రిస్ట్ రైలు యాత్ర(జ్యోతిర్లింగాల దర్శనం) ప్రారంభం కాబోతుందని ఐఆర్‌సీటీసీ టూరిజం మానిటర్ కొక్కుల ప్రశాంత్, సౌత్ సెంట్రల్ జోన్ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ కిశోర్ సత్య తెలిపారు. ఈ మేరకు శనివారం వారు కాజీపేట జంక్షన్, జనగామలో మాట్లాడుతూ పుణ్యక్షేత్రాలు అరుణాచలం, రామేశ్వరం, మదురై, శ్రీరంగం, కన్యాకుమారి, తిరుచ్చి, త్రివేండ్రం (అనంత పద్మనాభ స్వామి), తంజావూర్ తదితర క్షేత్రాలను సందర్శిస్తారన్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమై భువనగిరి, జనగామ, కాజీపేట వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా ప్రయాణం సాగుతుందని తెలిపారు. ఇందులో స్లీపర్, థర్డ్, సెకండ్ ఏసీలో ప్రయాణం చేసేందుకు వెసలుబాటు కల్పించామన్నారు. ఎనిమిది రాత్రులు, తొమ్మిది రోజుల పర్యటన కోసం టికెట్ ధర రూ.14,250తో ప్రారంభమవుతుందన్నారు. ఇందులో పిల్లలకు స్లీపర్ కోచ్ రూ.14,250, థర్డ్ ఏసీ రూ.21,880, సెకండ్ ఏసీ రూ.28,440 ధర నిర్ణయించామన్నారు. ఈ యాత్రలో రోజుకు మూడుసార్లు భోజన వసతితో పాటు ప్రతి కోచ్‌లో భక్తుల సేవాకార్యం గురించి ఐఆర్ సీటీసీ సిబ్బంది అందుబాటులో ఉంటారు. దక్షిణ మధ్య రైల్వేశాఖ చేపట్టిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం వెబ్‌సైట్ irctctourism.com లేదా 9281030749, 9989676794, 9701360701, 92810307 11/12 నంబర్లను సంప్రదించగలరని వారు తెలిపారు.

డాక్టర్ సుమంత్‌రెడ్డి మృతి

- ఎంజీఎంలో చికిత్స పొందుతూ కన్నుమూత
- కన్నీటి వీడ్కోలు పలికిన కుటుంబీకులు, బంధువులు, స్థానికులు

ఖిలా వరంగల్/కాజీపేట: డాక్టర్ గాదె సుమంత్ రెడ్డిపై హత్యాయత్నం కేసు వరంగల్‌లో సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో ప్రాణాపాయస్థితికి చేరుకున్న సుమంత్‌రెడ్డి.. సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో మెరుగైన చికిత్స పొందినప్పటికీ 8 రోజులుగా మృత్యువుతో పోరాడి చివరికి ఓడిపోయాడు. యశోద నుంచి సుమంత్ రెడ్డిని శుక్రవారం ఉదయం వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు అర్ధరాత్రి మృతి చెందాడు. సుమంత్ రెడ్డి మృతదేహానికి శనివారం పోస్టుమార్టం పూర్తి చేసి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు ప్రజల సందర్శనార్థం కాజీపేట సిద్ధార్థనగర్‌లోని తమ ఇంటితోపాటు కాజీపేటలోని క్లినిక్‌కు తరలించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాన్ని సంగారెడ్డికి తరలించారు. కాగా, వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంగా తన భర్త అడ్డు తొలగించుకోవాలని భార్య ఫ్లోరా ప్లాన్ మేరకు గత నెల 20వ తేదీన రాత్రి 10.30 గంటలకు ప్రియుడు శామ్యూల్, ఏఆర్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్.. వైద్యుడు సుమంత్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన విషయ విధితమే.



డాక్టర్ సుమంత్‌రెడ్డి (ఫైల్)

నిందితులపై హత్య కేసు నమోదు

సుమంత్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురు నిందితులపై తొలుత హత్యాయత్నం కేసు నమోదైంది. అయితే సుమంత్ రెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందగా.. ముగ్గురు నిందితులపై శనివారం హత్యకేసుగా మార్పు చేసినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంపీటీ)లో నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నం జరిగింది. గీసుకొండ సీఐ మహేందర్ కథనం ప్రకారం.. కేఎంటీపీలోని గణేశా ఎకోపెట్ కంపెనీలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన దంపతులు పని చేస్తున్నారు. అలాగే, నేపాల్‌కు చెందిన రాజు అనే వ్యక్తి కూడా అదే కంపెనీలో పని చేస్తున్నాడు. వారు కంపెనీలో కార్మికుల కోసం కేటాయించిన గదుల్లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం సాయంత్రం ఉత్తర్‌ప్రదేశ్ దంపతుల్లో భర్త కంపెనీలో పనికి వెళ్లగా అతడి భార్య, నాలుగేళ్ల కూతురు ఇంటి వద్ద ఉన్నారు. వారికి సమీపంలో ఉన్న రాజు ఆ బాలికకు కూల్ డ్రింక్ ఇస్తానంటూ మాయమాటలు చెప్పి తన గదికి తీసుకెళ్లాడు. లైంగికదాడికి యత్నించగా ఆ బాలిక ఏడవడంతో తల్లి, సమీపంలోని వారు అక్కడికి చేరుకున్నారు. దీంతో రాజు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

టీజీ ఎన్పీడీసీఎల్‌కు పీఎస్‌యూ లీడర్ షిప్ అవార్డు



సీఎండీ వరుణ్ రెడ్డికి అవార్డు అందజేస్తున్న ఇన్‌చార్జ్ డైరెక్టర్లు, కంపెనీ సెక్రటరీ

హన్మకొండ : తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ మండలి పీఎస్‌యూ లీడర్ షిప్ అవార్డు అండ్ ఇన్నోవేషన్ ఇన్ ఆపరేషనల్ ఎక్సలెన్స్ అవార్డు అందుకుంది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, అసిస్టెంట్ సెక్రటరీ ఎం.వి.రమణారెడ్డి అందుకున్నారు. ఈ అవార్డును శనివారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులందరికీ వినూత్న సేవలు అందించడంతో పాటు సాంకేతికతను అందిపుచ్చుకుంటూ మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సేవలు అందిస్తున్నందుకు ఈ అవార్డు దక్కిందన్నారు. ఎన్పీడీసీఎల్‌లో తీసుకొచ్చిన నూతన విధానాలు అమలుతో వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.ఈ అవార్డును స్ఫూర్తిగా తీసుకుని అధికారులు, ఉద్యోగులు రెట్టించిన ఉత్సాహంతో పని చేద్దామని పిలుపునిచ్చారు. ఇన్‌చార్జ్‌లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.ఈలు కె.తిరుమల్ రావు, బీకం సింగ్, రాజు చౌహాన్, రవీంద్రనాథ్, వెంకటరమణ, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, జాయింట్ సెక్రటరీ రమేశ్ , డీ.ఈ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మద్యం తాగొద్దని మందలించినందుకు..

- మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య
- కొత్తతండాలో ఘటన


నర్సింహులపేట: మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని జగ్గుతండా జీపీ పరిధిలోని కొత్తతండాలో చోటు చేసుకుంది. ఎస్సై మాలోత్ సురేశ్ కథనం ప్రకారం.. తండాకు చెందిన మాలోత్ వీరు(50) నిత్యం మద్యం తాగడం, వ్యవసాయ పనులకు వెళ్లకపోవడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన వీరు శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య కాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని యువకుడు..

గీసుకొండ: భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మరియపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొలమారి థామస్‌రెడ్డి (36) నాలుగు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన మంజులను వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు కుమారుడు జన్మించారు. మూడు నెలల నుంచి ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో భార్య తన తల్లిగారి ఇంటివద్ద ఉంటోంది. దీంతో థామస్‌రెడ్డి మనస్తాపంతో శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి సోదరి నీలిమ మేరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ సీఐ మహేందర్ శనివారం తెలిపారు.

జల్సాల కోసం చోరీలు..

- అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన టౌన్ సీఐ దేవేందర్



వివరాలు వెల్లడిస్తున్న టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ రూరల్ : జల్సాల కోసం చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు మహబూబాబాద్ టౌన్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ పెండ్యాల దేవేందర్ వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ మండలం ఇస్లావత్ తండా (ఎం) గ్రామానికి చెందిన ఇస్లావత్ సురేశ్ కొంత కాలంగా మహబూబాబాద్, మరిపెడ, ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం, ఏపీలోని విజయవాడ ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఫర్టిలైజర్ షాపులు, కిరాణం, వస్త్ర, ఇతర దుకాణాల్లో చోరీలకు పాల్పడుతూ జల్సాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం చోరీ చేసిన వస్తువులను మహబూబాబాద్‌లో అమ్మేందుకు వస్తున్నాడు. కురవి గేట్ దగ్గర వాహనాలు తనిఖీ చేస్తున్న మహబూబాబాద్ టౌన్, సీసీఎస్ పోలీసులకు అనుమానం వచ్చి సురేశ్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. ఇందులో రూ.8,500 విలువైన కిరాణా సామగ్రి, రూ.1,800 నగదు లభించింది. విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకోవడంతో నిందితుడిని అరెస్ట్ చేసి సెల్ ఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించిన్నట్లు సీఐ తెలిపారు. కాగా, నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బి.హతీరాం, టౌన్ సీఐ దేవేందర్, సీసీఎస్ ఎస్సైలు తాహెర్ బాబా, గోపి, మహబూబాబాద్ టౌన్ ఎస్సైలు కె.శివ, బి.విజయ్ కుమార్, సిబ్బంది రుద్రయ్య, సక్రాం, శ్రీకాంత్, ఉపేందర్ తదితరులను మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు అభినందించారు.

దారికాచిన మృత్యువు..

- సైకిల్‌ను ఢీకొన్న హైడ్రాలిక్ వాహనం
- తండ్రీ తనయుడి దుర్మరణం
- కోతులనడుమలో ఘటన




రాజేశ్వర్‌రావు(ఫైల్) వికాస్‌రావు (ఫైల్)

ఎల్కతుర్తి : సైకిల్‌పై బంధువుల ఇంటికి వెళ్తున్న తండ్రి, కుమారుడిని మృత్యువు కబలించింది. హైడ్రాలిక్ క్రేన్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిపై శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు, ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కోతులనడుమ గ్రామానికి చెందిన తంగెడ రాజేశ్వర్‌రావు (65) తన కుమారుడు వికాస్‌రావు (21)తో కలిసి సైకిల్‌పై వల్భాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో హుజూరాబాద్ నుంచి ఎల్కతుర్తి వైపునకు వెళ్తున్న హైడ్రాలిక్ క్రేన్ వాహనం అతివేగంగా వచ్చి ఢీకొనడంతో తండ్రి, కొడుకుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. తండ్రి, కుమారుడి మృతితో ఆ కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రూ. 3.50 లక్షల మిర్చి బూడిద

- పంట కుప్పకు నిప్పుపెట్టిన దుండగులు



కాలి బూడిదైన మిర్చి పంట

భూపాలపల్లిరూరల్ : రైతు ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంట.. మంటల్లో దగ్ధమైంది. ఈ ఘటన శుక్రవారం రాత్రి భూపాలపల్లి మండలం దూదేకులపల్లిలో చోటుచేసుకుంది. బాధిత రైతు అజ్మీరా పరంసింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. పరంసింగ్ తనకున్న 4 ఎకరాల భూమిలో మిర్చి పంట సాగుచేశాడు. ఆ పంట చేతికొచ్చిన అనంతరం తెంపి కల్లంలో ఆరబెట్టాడు. కొన్ని రోజులు ఎండిన తర్వాత తాలు, మేలు కాయలు వేరుచేసి కుప్ప పోశాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వరకూ మిర్చి కుప్పవద్ద కాపలా ఉన్నాడు. అనంతరం ఇంటికి చేరుకున్నాడు. అర్ధరాత్రి దుండగులు మిర్చి కుప్పకు నిప్పంటించారు. ఈ ఘటనలో సుమారు రూ.3.50 లక్షల విలువైన 16 నుంచి 18 క్వింటాళ్ల పంట కాలిబూడిదైందని పరంసింగ్ కన్నీరు మున్నీరయ్యాడు. రూ.లక్షల్లో అప్పు తెచ్చి పంటకు పెట్టుబడి పెట్టానని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించాడు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మహబూబాబాద్ రూరల్ : రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరి సిగ్నల్ కాలనీ ప్రాంతంలో చోటుచేసుకుంది. జీఆర్పీ కానిస్టేబుల్ గాంధీ, ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ నాగిరెడ్డి కథనం ప్రకారం.. కాజీపేట వైపు నుంచి ఖమ్మం వైపునకు డౌన్ లైన్‌లో షిర్డీ ఎక్స్‌ప్రెస్ వెళ్తోంది. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. లోకోపైలట్, స్టేషన్ మాస్టర్ సమాచారం మేరకు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించగా మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పోస్టు మార్టం గదికి తరలించి భద్రపరిచామని, ఎవరైనా గుర్తుపడితే జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.